ప్రజాశక్తి
సోమవారం 7 నవంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



'ఆదివాసీల అభివృద్ధిని అడ్డుకుంటున్న స్వార్థపరులు'

ప్రజాశక్తి - సీలేరు

జికె వీధి మండలం సీలేరులో ఆదివాసీల అభివృద్ధిని కొంతమంది స్వార్థపరులు అడ్డుకుంటున్నారని ఆదివాసీ నాయకులు కోడా ఆనంద్ మండిపడ్డారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది సీలేరు బతుకు తెరువు కోసం వచ్చి ఏపీ జెన్కో కాంట్రాక్టర్లుగా ఎదిగి అమాయక ఆదివాసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 3పై న్యాయస్థానాలను ఆశ్రయించి ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇటీవల ఏపీ జెన్కో అధికారులు గిరిజనులకు ఒక వర్క్‌ని కేటాయించగా దాన్ని రద్దు చేయాలని కోర్టుకి తప్పుడు సమాచారంతో వెళ్లారని తెలిపారు. ఆదివాసీ హక్కులను హరించి కోర్టులో వేసిన పిటిషన్ వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆదివాసీ ద్రోహులుగా ప్రకటించి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి, కుమారి, రవి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు మెమోల జారీ సరికాదు!

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు



మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత మహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : విద్యార్థులకు బైజూస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు వారి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ల రిజిస్ట్రేషన్ చేయలేదన్న కారణంతో ఏజెన్సీలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అల్లూరి జిల్లా విద్యాశాఖాధికారి మెమోలు జారీ చేయడం సరికాదని, తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వి మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. బైజూస్ యాప్ ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ల రిజిస్ట్రేషన్ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేసిప్పటికీ, ఏజెన్సీలోని పరిస్థితులు వల్ల అది ఆశించిన రీతిలో సాగదని అందరికీ తెలిసిన విషయమేనన్నారు. చాలా గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ లేకపోవడం, ఒకవేళ ఫోన్ ఉన్నా అది ఆండ్రాయిడ్ ఫోన్ కాకపోవడం ఒక కారణమైతే, గిరిజన ప్రాంతాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్, ఇతరత్రా సాంకేతిక, భౌగోళిక సమస్యలు వల్ల హెచ్‌ఎంలు వారికి నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయలేకపోయారన్నారు. అంతమాత్రాన దీనికి బాధ్యులను చేస్తూ హెచ్‌ఎంలకు మెమోలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే హెచ్‌ఎంలకు ఇచ్చిన మెమోలను డిఇఒ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో యుటిఎఫ్ ఐటిడిఎ సబ్ కమిటీ కో కన్వీనర్ ఎం.బాబురావు, అనంతగిరి మండల అధ్యక్షుడు పి.దేముడు పాల్గొన్నారు.

గుంతలైనా పూడ్చేందుకు గతి లేదా..?

వైసిపి ప్రభుత్వంపై మాజీ మంత్రి కిడారి శ్రావణ్ ధ్వజం

గిరిజన యువతతో శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - పెదబయలు : నిండా గోతులమయమై అధ్వాన్నస్థితిలో ఉన్న రోడ్లకు కనీసం మరమ్మతులు చేయలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, టిడిపి అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బంగారుమెట్ట, వన్నెడ మధ్యలో గుంతలు పడిన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులను స్వచ్ఛందంగా శ్రమదానంతో గోతులు పూడ్చుతుంటే, అటుగా ఒక కార్యక్రమానికి వెళుతున్న మాజీ మంత్రి కిడారి, గిరిజన యువతతో జతకలిసి, తానూ గోనెసంచులతో మట్టిని మోసుకొచ్చి గుంతలను పూడ్చే పనుల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి కిడారి శ్రావణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచిన, అనేక ప్రధాన రహదారులే వాహనాలు వెళ్లలేనంతగా రూపుకోల్పోయి పాడయ్యాయన్నారు. ఇక మారుమూల గిరిజన గ్రామాల దుస్థితి వేరేగా చెప్పనక్కర లేదన్నారు. ఉన్నరోడ్లలో ఏర్పడిన గుంతల్లో చిటికెడు మట్టి వేయలేని జగన్ ప్రభుత్వం, మారుమూల గ్రామాలకు రోడ్లు లేక అవస్థలు పడుతున్న ఏజెన్సీ వాసుల కష్టాలను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అనేక గ్రామాలకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా వెళ్లలేనంతగా రోడ్లు పాడయ్యాయని మండిపడ్డారు. ఇప్పటికైనా కొత్తరోడ్లు ఎలాగూ వేయలేని దయనీయస్థితిలో ఉన్న వైసిపి ప్రభుత్వం, ఉన్నరోడ్లకైనా మరమ్మతులు చేపట్టాలని కోరారు. మరో ఏడాదిన్నర తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి గిరిజన ప్రజల రాకపోకల కష్టాలను తీరుస్తుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణరాజు, అరడకోట వార్డు సభ్యుడు బాలకృష్ణ, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, మురళి, రాజు, గిరిజన యువత తదితరులు పాల్గొన్నారు



మట్టిని మోసుకొచ్చి గోతుల్లో వేస్తున్న మాజీ మంత్రి కిడారి



మహాసభలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

అటవీ సంరక్షణ చట్ట సవరణ ఆపాలి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి- రంపచోడవరం

కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్ట సవరణ ఆపాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం నాయకురాలు కొమరం చెల్లయమ్మ అధ్యక్షతన గిరిజన సంఘం మండల ప్రథమ మహాసభ జరిగింది. ఇందులో పాల్గొన్న రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో గిరిజనులకు తీవ్ర నష్టం కలిగించే అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనుందని తెలిపారు. చట్ట సవరణ జరిగితే బడా కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలకు అటవీ సంపదను గ్రానైట్, లేటరేట్, మైనింగ్‌ను దోసిపెట్టనుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏజెన్సీలో ఉన్న బాక్సైట్ సంపదను తరలించేందుకు ఎన్నో ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసిన 5వ షెడ్యూల్‌లో ఉన్న చట్టాల వలన ఏమి చేయడానికి వీలులేకుండా ఉందని తెలిపారు. ఇప్పుడు పార్లమెంట్‌లో అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లు పెట్టడం ద్వారా గిరిజనులను నట్టేట ముంచేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ దుశ్చర్యను ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జీవో 3ను పునరుద్ధరణ చెయ్యాలని, పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మండల కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో గిరిజన సంఘం మండల కమిటీ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సాదల విద్యాధర్‌రెడ్డి, తీగల శ్రీనివాస్, మరో ఐదుగురు ఆఫీస్ బేరర్స్‌గా, నలుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.బాపన్నదొర, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.వాణిశ్రీ, జిల్లా నాయకులు కె.శాంతిరాజు, కె.రామలక్ష్మి పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటికి ఇక్కట్లు

గిరిజనం కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

గ్రామాల సందర్శనలో గిరిజన సంఘం నేతల విమర్శ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :తాగు, సాగునీటికి గిరిజనం ఇక్కట్లు పడుతున్నా ప్రభుత్వం, అధికారులకు పట్టడం లేదని గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు కొర్ర డొంబ్రు, పాంగి భీమరాజు విమర్శించారు. ఆదివారం మండలంలోని దోడిపుట్టు పంచాయితీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోడిపుట్టు గ్రామలో కూరగాయలు పండించే గిరిజన రైతులకు సాగునీరు అందుబాటులో లేకపోవడం వల్ల అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామ సమీపంలోని గెడ్డలోని నీటిని ఇక్కడ పొలాలకు అందించేందుకు వీలుగా కనీసం మినీ లిఫ్ట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. పాంగి భీమరాజు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం, అధికారుల పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వపరంగా ఐటిడిఎ, ఇతర అధికారులు చర్యలు చేపట్టాలని, లేకుంటే మండలపరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



దోడిపుట్టులో ప్రజలతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

దేశాభివృద్ధికి యువతే పునాది

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



సదస్సులో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : దేశం ప్రగతిపథంలో పయనించాలంటే నేటి యువతలో మంచి మార్పు రావాలని జిల్లా న్యాయమూర్తి జి.శ్రీదేవి ఆకాంక్షించారు. ఆదివారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులను చైతన్యపరిచారు .ప్రధానంగా నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. తమ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని, యువత గంజాయి, నాటు సారా, డ్రగ్స్ బారిన పడకుండా చదువుపై దృష్టిపెట్టాలన్నారు.

చెడు అలవాట్లతో తక్షణమే ఆరోగ్యంతోపాటు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సాంకేతికపరంగా అనేక సంచలనాలు సష్టిస్తున్న నేటి యువత దేశ భవిష్యత్‌కు దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేటు స్టాల్స్‌ను తిలకించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు పబ్లిక్ పాఠశాల వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, సబ్ కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్, సిఐ జెడి బాబు, తహశీల్దార్ వేణుగోపాల్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే రోడ్డు ప్రమాదాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఘాట్‌రోడ్డు, ప్రధాన రహదారులలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని పాడేరు ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం పాడేరు అమ్మవారి పాదాలు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడూ రోడ్డు భద్రతా నియమ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. అతివేగం, హెచ్చరిక బోర్డులను గమనించి వాహనాలను నడపాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. హెల్మెట్ ధరించని బైకిస్టులు, ప్రయాణికులను ఎక్కించుకున్న సరుకుల వాహనాలను పట్టుకుని జరిమానా విధించారు. కారు డ్రైవర్ సీట్ బెల్ట్, బైకిస్టులు హెల్మెట్ ధరించకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు.



పాడేరు అమ్మవారి పాదాలు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ



ఎపి జెన్కో ఎస్ఇ ప్రశాంత్ కుమార్‌ను కలిసిన డిప్లమో ఇంజనీరింగ్ నాయకులు

ఎపి జెన్‌కో ఇంజినీరింగ్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి- సీలేరు

ఏపీ జెన్కో సీలేరు జోన్‌లో ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లమో ఇంజనీరింగ్ అసోసియేషన్ రికగ్నైజేడ్ ట్రేడ్ యూనియన్ (బి-473) నూతన ఎన్నిక శనివారం జరిగింది. ఏపీ జెన్కో సీలేరు జోనల్ అధ్యక్షులుగా ఎ.పవన్ ప్రియరాజ్, కార్యదర్శిగా కె.శివశంకరావు, ట్రెజరర్‌గా పి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ (సివిల్) కే కే వి ప్రశాంత్ కుమార్, ఈఈ జాకీర్ హుస్సేన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్లమో ఇంజనీర్లు సమస్యలు తెలపగా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు పవన్ ప్రియరాజ్ తెలిపారు.

సిపిఎంలో 38 కుటుంబాలు చేరిక

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలకు ఆకర్షితులైనట్లు వెల్లడి

ప్రజాశక్తి-విఆర్.పురం

కూనవరం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన 38 కుటుంబాలు ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సిపిఎం)లో చేరాయి. వారికి సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు సిపిఎం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సమస్యల పట్ల సిపిఎం నిరంతరం చేస్తున్న ఆందోళన, పోరాటాలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరుతున్నట్టు సిపిఎంలో చేరిన కన్నాపురం గ్రామస్తులు తెలిపారు. తొలుత కన్నాపురంలో ఆ గ్రామ పెద్ద కలుముల దేవ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలతో జగన్మోహన్ రెడ్డి మాయమాటలు ఓటేసి పట్టం కట్టారని, కానీ నేడు ప్రజలు కష్టాల్లో ఉంటే పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. నాలుగు సార్లు వరదలు వచ్చి సహాయం కోసం ఎదురు చూస్తున్న ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా ఇవ్వలేకపోయిందని, వైసిపి ప్రజాప్రతినిధులు కనీసం పరామర్శ కూడా చేయలేదని తెలిపారు. దీంతో వైసీపీపై ఉన్న భ్రమలు పూర్తిగా తొలిగిపోయాయన్నారు. వరదలు వచ్చినప్పటి నుండి సిపిఎం సాహసంతో ప్రజలకు మనోధైర్యాన్ని కల్పిస్తూ వారికి అండగా ఉంటూ సహాయ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. వరద బాధితులకు భోజనం సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు అనంతరం ప్రజలు రోగాల బారిన పడిన ప్రజలకు వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించిందని చెప్పారు. ఈ విధంగా మరే ఇతర పార్టీ చేయలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు, వరద బాధితులకు న్యాయం జరిగేంత వరకు సిపిఎం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కాక అర్జున్, మండల కార్యదర్శి బి.బొర్రయ్య, టి.తమ్మయ్య, పోడియం దేవ, నంద, మడెం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



సిపిఎంలో చేరిన కన్నాపురం గ్రామస్తులతో కలిసి నినాదాలు చేస్తున్న ఆ పార్టీ నేతలు కిరణ్, నాగేశ్వరరావు తదితరులు



సోలార్ తాగునీటి పథకం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

తాగునీటి పథకానికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి ఎటపాక

మండలంలోని కృష్ణవరం పంచాయతీ జిన్నగట్ట గిరిజన గ్రామంలో మరమ్మత్తు గురైన సోలార్ వాటర్ సిస్టమ్‌ను బాగు చేసి నీటి ఎద్దడిని తీర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ నాయకులు సోలార్ వాటర్ సిస్టమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మే నెలలో వచ్చిన గాలివానకు సోలార్ ప్లేట్ కింద పడి విరిగి పోయిందని, ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా మరమ్మతులు చేయలేదని పేర్కొన్నారు. దీంతో అక్కడున్న 40 కుటుంబాలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేసి నీటి ఎద్దడి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణవరం ఎంపిటిసి కంటే రాజు, మాజీ సర్పంచ్ పద్దం సత్తెమ్మ, గన్నవరం ఉపసర్పంచ్ కందుకూరి స్వర్ణ, గిరిజన సమాఖ్య మండల ఉపాధ్యక్షుడు సున్నం శ్రీను, రైతు సంఘం నాయకులు పూసా రాఘవులు, ముసునూరి వెంకన్న బాబు, ప్రసాద్, సత్యనారాయణ, సత్యం, వీరయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ బోర్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శివశంకర్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని కిలగాడ గ్రామపంచాయతీ పరిధిలోగల పడాలపుట్టు, కొత్తుల బయలు గ్రామాలలో జలజీవన్ మిషన్ నిధులతో బోర్లు తవ్వే పనులకు స్థానిక సర్పంచ్ శివశంకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పడాలపుట్టు, కొత్తులబయలు గ్రామాల్లో చెరో రూ..10.80 లక్షలతో మొత్తంగా రూ. 21.60లక్షలను వెచ్చించి, తాగునీటి సమస్యను అధిగమించేందుకు పెద్ద ట్యాంకులను నిర్మించి, వాటి ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందజేస్తామన్నారు. ఏటా తాగునీరు లేక అల్లాడుతున్న గిరిజనులకు జలజీవన్ మిషన్ నిధులతో రెండు గ్రామాల్లోనూ బోరుబావులు ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలోని మిగిలిన గ్రామాల్లోనూ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకొని జలజీవన్ మిషన్ నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు.


గడచిన మూడేళ్లుగా పంచాయతీలకు నిధులు లేని పరిస్థితుల్లో గ్రామాల్లోని తాగునీరు, ఇతరత్రా సమస్యలను పరిష్కరించలేని దుస్థితిలో ఉన్న పంచాయతీలకు మండల సర్వసభ్యసమావేశాల్లో సమస్యను ప్రస్తావించగా, ఎంపిపి చొరవతో ఎంపిడిఒ నివేదికలను ఉన్నతాధికారులకు పంపడంతో ఈ మేరకు జలజీవన్ మిషన్ నిధులు మంజూరై, తాగునీటి సమస్య పరిష్కారమౌతోందని సర్పంచ్ శివశంకర్ వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు మట్టం కిరణ్‌కుమార్, మాజీ ఎంపిటిసి ఉబ్బన్న, గ్రామ పెద్దలు, చందు, మత్యరాజు, రాంబాబు, తిరుపతి, కామేష్, క్రిష్ణమూర్తి, త్రినాధరావు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి'

ప్రజాశక్తి-పాడేరు టౌన్

ఇచ్చిన మాటకు కట్టుబడి తండ్రికి తగ్గ తనయుడిగా సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత సిఎం జగన్ కే దక్కుతుందని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పాడేరు పట్టణంలోని పాత బస్‌స్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా 341 రోజులపాటు 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టారన్నారు కార్యక్రమంలో ఎంపిపి సొనారి రత్నకుమారి, వైస్ ఎంపిపి కనకాలమ్మ, సర్పంచులు సిదరి రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, లకే పార్వతమ్మ, ఎంటిసిలు సూరిబాబు, నరసింహమూర్తి, చిట్టెమ్మ,పాల్గొన్నారు.

కొయ్యూరు : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్య స్థాపన జరుగుతుందని ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రకు ఐదు వసంతాలు పూర్తి అయిన సందర్భంగా కొయ్యూరు మండలం కొండగోకిరి పంచాయితీ గుజ్జిమానుపాకలు గ్రామంలో ఎంపీపీ రాజశేఖర రెడ్డి విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగాలు వచ్చాయని, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీరు సేవలందించడానికి వచ్చారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీలు ఇలా ప్రతి గ్రామానికి విలువైన ఆస్తులు సమకూర్చబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జల్లి బాబులు, రేగటి ముసలి నాయుడు, గాడి అచ్చిరాజు, పాటి శేఖర్, కొడ రాజుబాబు, పాటి చిన్నయ్య, రీముల గంగాధర్, రామరాజ్యం, బాబ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రమేష్

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రమైన వడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని వడ్డిగూడెం కోటగొమ్ము వీధిలో రూ.3 లక్షలు జెడ్‌పిటిసి నిధులుతో సిసి రోడ్లు నిర్మాణానికి జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల సీజన్లలో భారీ వరదల కారణంగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయని, వడ్డిగూడెం రోడ్లు నడవడానికి ఇబ్బందిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఫణింద్రరెడ్డి, సర్పంచ్ సోడి నరసమ్మ, పిఆర్ ఎఇ రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ స్వరూప్ రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, తెలుగుదేశం మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బొర్ర నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి రంగారెడ్డి, ఎంపిడిఒ తదితరులు



సాగర్‌నగర్ తీరంలో చెత్తను సేకరిస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున తదితరులు

తీర స్వచ్ఛతకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - మధురవాడ : తీరం స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపు నిచ్చారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ సూచన మేరకు సాగర్‌నగర్ బీచ్‌లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యాన నగరంలోని సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రతి నెలా మొదటి ఆదివారం విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 6 విడతల బీచ్ క్లీన్ కార్యక్రమంలో 175 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే బీచ్ ప్రాంతాలను 10 సంస్థలు దత్తత తీసుకున్నాయన్నారు. ప్రతి రోజూ సదరు సంస్థల సభ్యులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతిరోజూ టూరిస్టులు విశాఖలోని వివిధ బీచ్ ప్రాంతాల్లో సందర్శిస్తుంటూరని, వీరికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, స్థానిక ప్రజలు, హెచ్‌పిసిఎల్ ప్రతినిధులు, సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

9న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నం జిల్లాలోని వివిధ కంపెనీలలోఉద్యోగాల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ (టెక్నికల్) తెలిపారు. కెఎఫ్‌సి సంస్థలో టీమ్ మేనేజర్ ఉద్యోగాలు 50 ఖాళీలకు ఎస్-ఎస్‌సి ఆపైన విద్యార్హత గల స్త్రీపురుష అభ్యర్థులు, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు జీతం ఉంటుందన్నారు. సిఎంఆర్ గ్రూప్ సంస్థలో సిఎస్‌ఎ 200 ఖాళీలకు ఎస్‌ఎస్‌సి ఆపైన విద్యార్హతగల స్త్రీ పురుష అభ్యర్థులు, 18 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందన్నారు. అపోలో హోమ్ కేర్ సంస్థలో హోమ్ కేర్ నర్సు, హోమ్ కేర్ నర్సింగ్, అసిస్టెంట్స్ పేషెంట్ కేర్ అసిస్టెంట్, ఉద్యోగాలు 50 ఖాళీలకు జిడిఎ, ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం, బిఎస్‌సి నర్సింగ్ విద్యార్హత గల స్త్రీపురుష అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,500 నుంచి రూ.28,500 జీతం ఉంటుందని పేర్కొన్నారు. గుడ్ వర్కర్ ఫర్ పేటీఎం జస్ట్ డయల్ సంస్థలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ 100 ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సి ఆపైన విద్యార్హత గల పురుష అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.18,400 నుంచి రూ.22,600 వరకు జీతం ఉంటుందని వివరించారు. బి న్యూ మొబైల్స్ సంస్థలో సిఎస్‌ఎ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఇంటర్ ఆపైన విద్యార్హత కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న స్త్రీపురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు జీతం ఉంటుందన్నారు. బిగ్ బాస్కెట్ సంస్థలో డెలివరీ ఎగ్జిక్యూటివ్ 50 ఖాళీలకు ఇంటర్ ఆపైన విద్యార్హత గల పురుష అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నేషనల్ కెరీర్ వెబ్‌సైట్ ncs.gov.in లో తమ వివరాలను రిజిస్టర్ చేసుకొని బయోడేటా, సర్టిఫికెట్లతో ఆ రోజు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

వైసిపి పాలనలో ఎక్కడి సమస్యలక్కడే

'బాదుడే బాదుడు'లో మాజీ మంత్రి కిడారి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గడచిన మూడున్నరేళ్లలో ఏజెన్సీలో కనీస అభివృద్ధి జరగకపోగా, ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేసి ఉన్నాయని మాజీ మంత్రి, అరకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కిడారి శ్రావణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని పెదగూడ పంచాయతీ జరిపడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజర్ సెక్రటరీ పాంగి శాస్త్రిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడారికి గ్రామస్తులు, స్థానిక మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జరిపడ గ్రామానికి గతంలో మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హయాంలో రోడ్డు మంజూరైందని, నేటికీ అది పూర్తి చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేటికీ ఒక్క రోడ్డైనా వేసిన పాపాన పోలేదని, అనేక గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు ఇలా అన్ని సమస్యలున్నా ఏ ఒక్కదాన్నీ వైసిపి ప్రభుత్వం పరిష్కరించలేదన్నారు. పాదయాత్రలో సిఎం జగన్ కుప్పలు తెప్పలుగా ఇచ్చిన హామీలు కనీసస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వస్తేనే గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కాంతులు వెల్లివిరుస్తాయన్నారు. ప్రజాకంటక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపి, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణరాజు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, వైస్ ప్రెసిడెంట్ మఠం, అరకోట వార్డు సభ్యుడు బాలకృష్ణ, మండల టిడిపి సీనియర్ నేతలు నీలకంఠ పాత్రో, చవిటియ గోపాల్, చెండా గోపాల్, కాగువతి పడాల్, పేలమాల చిరంజీవి, తంగుల మాణిక్యం, వైత్రోన్, కామేష్, గాంధీ, సింహాచలం, నాగేష్, రామో, పాత్రుడు, రామదాసు, ధనుంజయ, త్రినాథ్, అర్జున్, మధు, మండి ప్రభాకర్, గ్రామస్తులు పరుకొండి గోపాల్, గణపతి, మట్టం అనిలకుమార్, సతీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - హుకుంపేట: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్‌పిటిసి వేగం మత్స్యలింగం అన్నారు. ఆదివారం మండలంలోని మారుమూల దుర్గం పంచాయితీ రనంకోట, సంపంగిపుట్టు, దుర్గం, మత్స్య పురం గ్రామాలను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో అర్హులందరికీ అందించేందుకు సచివాలయ సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. గ్రామంలో రోడ్డు, సిగ్నల్ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాపా ఎంపిటిసి వెంకట నాగలక్ష్మి, సంపంగిపుట్ట పాస్టర్ జాన్, శామ్యూల్, ప్రసాద్, కేశవరావు, వెంకటరావు జర్రకొండ మాజీ వార్డు సభ్యులు స్వామి నాయుడు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి

జూలో సందడి



జూలో సందడి చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన సందర్శకులతో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, కంబాలకొండ, ముడసర్లోవ పార్కులు సందడిగా మారాయి. చిన్న, పెద్ద, వృద్ధులు తమ కుటుంబాలతో కలిసి వచ్చారు. వివిధ పాఠశాల విద్యార్థులు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల సభ్యులు రావడంతో పార్కులన్నీ కిటకిటలాడాయి.

జూ పార్కు ఆదాయం రూ.5.29 లక్షలు

ఇందిరాగాంధీ జంతుప్రదర్శన శాలను ఆదివారం 9,179 మంది సందర్శించారు. వీరి ద్వారా జూ పార్కుకి రూ.5 లక్షలా 29 వేలా 340 ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

నేరాలు ఘోరాలు

గుండె పోటుతో మార్కెట్‌లో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : చేపలు కొనేందుకు తోటగరువు చేపల మార్కెట్‌కు వచ్చిన వ్యక్తి ఒక్కసారి కుప్పకూలారు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారి ఉలిక్కిపడి వెంటనే 108 ద్వారా కెజిహెచ్‌కు తరలించారు. ఆయన అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కుప్ప కూలిన సమయంలోనే అతని ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. మృతుడు పిఎం పాలెం, బాలాజీ హోమ్స్‌లో నివాసముంటున్న ప్రేమానంద శ్యామ్‌సన్(62)గా పోలీసులు పేర్కొన్నారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రేపటి నుంచి విమ్స్‌లో కీళ్ల నొప్పులపై మెగా మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో మంగళ, బుధవారాల్లో మెగా ఆర్థో మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులో తీవ్ర కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, వృద్ధాప్యపు నొప్పులతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.2,000 విలువచేసే ఎముకుల సాంద్రత పరీక్ష బిఎండి, సీరం యూరిక్ యాసిడ్ పరీక్షలను ఉచితంగా రోగులకు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ మెడికల్ క్యాంపును విమ్స్ పోర్టుకోలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి -ఆరిలోవ : ప్రమాదవశాత్తూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు అవయవాలను కుటుంబీకులు దానం చేసేందుకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని జీవన ధాన్ ప్రోగ్రాం రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ మెయిన్ బ్రాంచ్‌లో ఆదివారం అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా అవయవాల కోసం ఎదురుచూస్తూ వేలమంది చీకటి జీవితాలు గడుపుతున్నారన్నారు. వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు అవయవ దానం ఒకటే సరైన మార్గం అన్నారు. ఇందుకోసం ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. తమ చుట్టూ ఉన్నవారికి, తల్లిదండ్రులకు అవయవదానంపై అవగాహన కల్పించాలని కోరారు. గత రెండేళ్లగా రాష్ట్రంలో అవయవ దానంపై అనేక ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను, యువతను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఆర్‌ఐటిలో 'ప్రేరణ'

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంట్యాం వద్ద గల నడింపల్లి సత్యనారాయణ రాజు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఐటి ఎమ్ఎన్‌సి విప్రో హెడ్ గ్లోబల్ ప్రొఫెసర్ పిబి.కొట్టూర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్లోబల్ ప్రపంచంలో విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా డిజిటల్ విప్లవంలోనికి మారాలని సూచించారు. 2075 సంవత్సరం కల్లా భారతదేశం ఆర్థికవృద్ధిలో నెంబర్ వన్ అవుతుందన్నారు. ఇండస్ట్రీ 4.0లో అటానమేషన్ శిక్షణలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. మార్పులకనుగుణంగా విద్యార్థులు నూతన ఒరవడిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.రాంజీ, కళాశాల చైర్మన్ నడింపల్లి సత్యనారాయణ రాజు, కళాశాల డైరెక్టర్ మురుగదాస్, సెక్రటరీ ప్రసాద్‌రాజు, ట్రెజరర్ కనకరాజు, డీన్ శర్మ పాల్గొన్నారు

ఉత్సాహంగా పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 56వ బెటాలియన్ ఐటిబిపి విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా తర్లువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా సాగాయి.



అసంపూర్తి రోడ్డును చూపుతున్న మంగేశ్వరరావు తదితరులు

అసంపూర్తిగా సిసి రోడ్లు

- వైస్ ఎంపిపి దొంతు మంగేశ్వరరావు

ప్రజాశక్తి - ఎటపాక : మండలంలోని గౌరీదేవిపేట పంచాయితీ పరిధిలో సిసి రోడడ్ల నిర్మాణాలు రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎటపాక వైస్ ఎంపిపి దొంతు మంగేశ్వరరావు అన్నారు. ఆదివారం అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలోని సంభవించిన అగ్నిప్రమాదం సమయంలో ఫైర్ ఇంజన్ వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో ఇబ్బంది కలిగిందన్నారు. అదే కాంట్రాక్టర్ రోడ్లు వదిలి సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. వెంటనే అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామస్తులతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బేబీ, ప్రదీప్, సంతోష్, రాజ, శశాంక్, సాయి,పుల్లారావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచక పాలన'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన నడుస్తుందని జనసేన అరుకు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంపూరి గంగులయ్య అన్నారు. ఆదివారం రాజవొమ్మంగిలో జనసేన క్రియాశీల సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఆ పార్టీ మండల అధ్యక్షులు బొదిరెడ్డి తిరుమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంగులయ్య, కాకి స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాలన వలన సామాన్య మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాలపైనా, గిరిజనులపైనా దాడులు విపరీతంగా పెరగాయని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య బద్దంగా పోరాటం చేస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. పవన్ కళ్యాణ్‌ని చూస్తే ముఖ్యమంత్రికి వణుకు పుడుతుందన్నారు. బోయ, వాల్మీకులను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చడం వలన 32 ఉప కులాలకు చెందిన గిరిజనులకు తీవ్ర నష్టం చేకూరుతుందని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే రంపచోడవరం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పి.అప్పారావు, కే లోకేష్, సిద్ధు, వెంకటరమణ, జయరామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోనెక్స్ సన్ రైజ్ బ్యాడ్మింటన్ టోర్నీ


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యోనెక్స్ సన్ రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2022 విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఈస్ట్ కోస్ట్ రైల్వే డిఆర్‌ఎం అనుప్ సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నమెంట్ విశాఖకు ఎంతో ప్రాముఖ్యతను పెంచిందన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పురుషుల సింగిల్స్‌లో ఎం.మిథున్, మహిళా సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ, పురుషుల డబుల్స్‌లో దీప్ రంభియ, అక్షాన శెట్టి జోడీ గెలుపొందారు. మహిళల డబుల్స్‌లో ఖుషి గుప్తా, ప్రియా దేవి గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హేమ నాగేంద్రబాబు, కనిక కాన్వాల్ జంట గెలుపొందింది. ముగింపు కార్యక్రమంలో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంకం చౌదరి, విశాఖ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎసిపి చుక్క శ్రీనివాస్, సెక్రటరీ పల్లా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉషశ్రీ , విల్లూరి భాస్కర్ పాల్గొన్నారు.

కదలని కారిడార్

పురోగతిలేని మౌలిక సదుపాయాలు
రాని కొత్త పరిశ్రమలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖపట్నం - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) పనులు ముందుకు కదలడంలేదు. ఎగుమతి ఆధారిత తయారీగా పరిశ్రమలు ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని చెప్పి, రైతుల నుంచి భూములు సేకరణపై చూపిన శ్రద్ధ పరిశ్రమలను రాబెట్టడంలో ప్రభుత్వాలు చూపడంలేదు. విసిఐసిలో భాగంగా అచ్యుతాపురం, నక్కపల్లి క్లస్టర్ల కింద ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) వేలాది ఎకరాల భూమి సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించడంలోనూ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలోనూ పురోగతిలేదు. అచ్యుతాపురం క్లస్టర్ కింద ప్రయివేటు భూమి 1749.51 ఎకరాలు, ప్రభుత్వ భూమి 781.27 ఎకరాలు వెరసి 2530.78 ఎకరాలను సేకరించింది. అచ్యుతాపురం క్లస్టర్‌లో రెండు దశల్లో రాంబిల్లి మండలంలోని కృష్ణపాలెం, గోరపూడి, జెడ్.చింతువ, లాలం కోడూరులో అభివృద్ధి చేయాలని భావించారు. తొలిదశలో రూ.152 కోట్లతో అభివృద్ధి చేయడం ద్వారా ఫార్మాస్యూటికల్, కంట్రోల్ ఎక్విప్‌మెంట్, వైద్య పరికరాలు, సోలార్ పేనల్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలు వస్తాయని వేసిన అంచనా కార్యరూపం దాల్చలేదు. నక్కపల్లి క్లస్టర్‌లో జిరాయితీ భూమి 2,380.81 ఎకరాలు, ప్రభుత్వ భూమి 1737.82 ఎకరాలు వెరసి 4,318.63 ఎకరాలను ఎపిఐఐసి సేకరించింది. అందులో 1120 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా కింద చందనాడ, వేంపాడు, డిఎల్ పురం, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట గ్రామాల్లో అభివృద్ధి చేయాలని భావించారు. మిగిలిన 3198.63 ఎకరాలను నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసిడిసి) అభివృద్ధి చేయనుంది. దీంట్లో పెట్రో కెమికల్స్, కెమికల్ జోన్ ఇతర పరిశ్రమలకు కేటాయించనుంది. రూ.490 కోట్లతో 1120 ఎకరాల స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయాల్సివున్నప్పటికీ నిధులు సమస్య వుండడంతో మౌలిక సదుపాయాల కల్పనలో ఆశించిన ప్రగతి కనిపించడంలేదు. ఈ ప్రాంతంలో ఫార్మాస్యూటికల్స్ కంపెనీలు, ఏరోస్పేస్, డిఫెన్స్, మెషినరీ ఫ్యాబ్రికేషన్స్, కాస్టింగ్ అండ్ ఫోర్జింగ్ వంటి పలు యూనిట్లు రావడం ద్వారా దాదాపు 18 వేల మందికి ఉపాధి లభించనుంది.



ప్రధాని సభను విజయవంతం చేయాలి

అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 11న విశాఖకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లుపై ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి మోడీ వస్తున్నారని చెప్పారు. ప్రధాని సభ జరిగే ప్రాంగణంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాని సభకు పెద్ద ఎత్తున జనం హాజరవుతారని, వారిని ఎంత సురక్షితంగా సభకు తీసుకువస్తారో, తిరిగి వెళ్లేటప్పుడు అదే విధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సభలో ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగిస్తారని, అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని తెలియజేశారు. సభా ప్రాంగణం నుంచి ప్రముఖులు బయటకు వెళ్లిన తర్వాత సభికులను వారి వారి వాహనాల వద్ద వదిలి పెట్టాలని ఆయన సూచించారు. దీనిని రాజకీయ సభగా భావించకుండా చాలాకాలం తర్వాత రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోడీకి గౌరవ సభగా భావించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, పక్కన ఎంపీ విజయసాయిరెడ్డి

ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈ నెల 11న సాయంత్రం 7 గంటలకు విశాఖకు చేరుకుంటారని, ఆయనకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వాగతం పలుకుతారని తెలియజేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కాసేపు సమావేశమవుతారని చెప్పారు. 12న ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే సభలో ఏడు పథకాలకు మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. ప్రధాని సభకు భారీగా తరలివచ్చే జనానికి అవసరమయ్యే కనీస సౌకర్యాలు 10వ తేదీ నాటికి పూర్తి కావాలని అధికారులను కోరారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. 11 గంటలకు మోడీ సభ ప్రారంభమవుతుందని, 10 గంటలకే జనం సభా ప్రాంగణానికి వచ్చేటట్టుగా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఉంచుతామని విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ ప్రకటించాలని టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారానికి 584వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మోడీపై ఒత్తిడి పెంచాలన్నారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తున్నందున ప్రైవేటీకరణ చేయరాదని అన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో యూనియన్ నాయకులు పీలా వెంకటరమణ, దేవర శ్రీనివాస్, నరేంద్ర, రాజు ఉన్నారు.

నిరుద్యోగ సమస్యపై 25న చలో ఢిల్లీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ అధ్వర్యంలో ఈ నెల 25న చలో ఢిల్లీ - పార్లమెంట్ మార్చ్ కార్యక్రమం చేపట్టినట్టు ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా సమావేశం అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో అచ్యుత్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను అమలు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ అధికారంలోకి రాకముందు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి. నేడు అధికారంలోకి వచ్చాక ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇవ్వకపోగా, నిరుద్యోగుల సమస్యల గురించి ప్రశ్నిస్తే పకోడీ బండ్లు పెట్టుకుని బతకండి అంటూ పార్లమెంటు సాక్షిగా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో నాయకులు క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఎఐవైఎఫ్ విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎరిపిల్లి రాంబాబు, కో - కన్వీనర్లుగా కె.అచ్యుత్, మధురెడ్డి, నాగరాజు ఎన్నికయ్యారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం జగన్ ఆరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారంపై పవన్ కల్యాణ్ దష్టి సారిస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఆరాటపడుతున్నారని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని రాక్షస పాలనలోకి నెట్టిందని విమర్శించారు. కేవలం జనసేన సభకు ఇప్పటం గ్రామస్తులు స్థలం ఇచ్చారనే కక్షతో 53 ఇళ్ళను అన్యాయంగా కూల్చి వేశారన్నారు. ఆ గ్రామానికి ఆర్‌టిసి బస్సు లేదని, మంగళగిరి మాస్టర్ ప్లాన్‌లో కనీసం రోడ్ లేదని, అటువంటప్పుడు 100 అడుగుల రోడ్డు వెడల్పు సాకుతో ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్ స్థలం అయితే ముందుగా నోటీసులు ఇచ్చి, నష్టపరిహారం చెల్లించి రోడ్లు వేయాలని, అలా చేశారా అని అడిగారు. జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు నీటిని ఎలా కొలుస్తారో తెలియదన్నారు. జోగి రమేష్ ఒక ఇల్లునూ కూల్చలేదని అబద్ధాలు ఆడుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ వారానికి ఒక రోజు వస్తారని మంత్రి అమర్‌నాథ్ అంటున్నారని, అలా అయితే ముఖ్యమంత్రి జగన్ 15 రోజులకు ఒకసారైనా బయటకు రారని, దానికి ఏమంటారని ఎద్దేవా చేశారు. నలుగురు రెడ్డిలతో జగన్ పాలన నడుస్తోందని, వీరంతా దసపల్లా, రుషికొండ, హాయగ్రీవ భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. విధానపరమైన విమర్శలు చేయాలని, రెచ్చగొట్టే విధంగా కాదని అన్నారు. చోడవరం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పివిఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ తాడేపల్లి నుండి వచ్చిన స్క్రిప్ట్‌ను మంత్రులు వల్లి వేస్తుంటారన్నారు. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టునూ పూర్తి చేయలేక పోయారని, ఒక్క పరిశ్రమనూ విశాఖకు తీసుకు రాలేదని అన్నారు. కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని రైల్వే స్పోర్ట్స్ మైదానంలో ఏర్పాటు చేసిన గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాన్ని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ రైల్వే డివిజనూ ఇంత గొప్ప గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం ఏర్పాట్లు చేయలేదన్నారు. రైల్వే అధికారులతో పాటు విశాఖ నగరానికి చెందిన వ్యక్తులు కూడా నిర్ణయించిన రుసుము చెల్లించి ఇక్కడ శిక్షణ పొందవచ్చని తెలిపారు.